దాసోజు శ్రవణ్‌కు ఎమ్మెల్సీ

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ కు కృతజ్ఞతలు

రవీంద్ర భారతి, మార్చి 11: విశ్వ బ్రాహ్మణ విశ్వకర్మ జాతిబిడ్డ దాసోజు శ్రవణ్ కు బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పదవిని కేటాయించడం హర్షణీయమని విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర నేతలు బీఆర్ఎస్అ ధినేత కేసీఆర్, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు కృతజ్ఞతలు తెలిపారు. మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు వేములవాడ మదన్మోహన్, గౌరవ అధ్యక్షుడు లాలు కోట వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి చొల్లెటి కృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. 40 ఏండ్లుగా విశ్వబ్రాహ్మణ విశ్వకర్మలు చట్టసభల్లో వెనుకబడిపోయారని, అన్ని రాజకీయ పార్టీలు తమ జాతికి రాజకీయ పదవులు ఇవ్వాలని వారు పేర్కొన్నారు. అలాగే 40 ఏండ్లుగా బీజేపీ పార్టీలో అహర్నిశలు ప్రజల కోసం పనిచేస్తున్న తల్లోజి ఆచారి కి బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి ఇవ్వాలని ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు జేపీ నడ్డాలకు విజ్ఞప్తి చేశారు.

పీహెచ్‌డీ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుదల

తెలుగు యూనివర్సిటీ, మార్చి 11: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం 2023-24 విద్యా సంవత్సరానికి వివిధ కోర్సులకు సంబంధించి పీహెచ్‌డీలో చేరడానికి నిర్వహించిన ప్రవేశ పరీక్షల ఫలితాలను మంగళవారం వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య కోట్ల హనుమంతరావు విడుదల చేశారు. ప్రవేశ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు ఈనెల 17నుంచి 20వ తేదీ వరకు కోర్సుల్లో ప్రవేశాల కోసం జరుగుతున్న ఇంటర్వ్యూలకు హాజరుకావచ్చని సెంట్రల్ అడ్మిషన్ కమిటీ డైరెక్టర్ డాక్టర్ బి. రాధ తెలిపారు. రాత పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారు జాబితాను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ www. telugu univer sity.ac.inలో వీక్షించవచ్చని సూచించారు.

యానిమేషన్ చిత్రాల్లో ప్రత్యేక జ్యూరీ అవార్డు

కార్యక్రమంలో యానిమేషన్‌లో జ్యూరీ అవార్డు అందుకుంటున్న ఎం.అరుణకుమారి

తెలుగు యూనివర్సిటీ, మార్చి 11: చిల్డ్రన్స్ నేచర్ అండ్ వైల్డ్ లైఫ్ చిత్రోత్సవాల అవార్డు కార్యక్రమంలో కొండపల్లి బొమ్మల నుంచి ప్రేరణ పొంది స్టాఫ్ ఫ్రేం యానిమేషన్ రూపొందించిన ఎం. అరుణకుమారి ప్రత్యేక జ్యూరీ అవార్డును అందుకున్నారు. లకిడికాపూల్‌లోని హోటల్‌లో జరిగిన నాలుగవ చిత్రోత్సవంలో హైదరాబాద్ నుంచి అరుణకుమారి ఒక్కరే ఈ అవార్డును అందుకున్నారు. అమ్మమ్మ చెప్పే నీతి కథలు, రామాయణం, మహాభారతంలో మూలాలు ఉన్న వాడుకలలో లేని కథలను పిల్లలకు చెప్పాలనే ఉద్దేశంతో పలు యానిమేషన్ చిత్రాలను నిర్మించి దేశ, విదేశాలలో ఫిల్మ్ ఉత్సవాలకు పంపించినట్లు అరుణకుమారి తెలిపారు. అరుణకిరణాలు క్రియేషన్స్ ఎకేసీ యూట్యూబ్ ఛానెల్ పలు షార్ట్ ఫిల్మ్ చిత్రాలు, లఘు చిత్రాలు, పాటలు పిల్లల కోసం తీసుకువచ్చినట్ల ఆమె వెల్లడించారు. ఈ వేడుకలలో ప్రొడ్యూసర్ ఎం. శ్రీహర్ష, డైరెక్టర్ భాను ప్రకాష్, సంగీతం సమకూర్చిన లామీ పాల్గొన్నారు.

ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌ను మార్చాలి

20శాతం రైతులు ఒప్పుకోక ముందే టెండర్లు ఎలా పిలుస్తారు

ఎన్ హెచ్ఏఐ కార్యాలయం వద్ద రైతుల ఆందోళన

బంజారాహిల్స్ రోడ్ నం.2లోని నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ప్రాంతీయ కార్యాలయం వద్ద బాధిత రైతుల ఆందోళన

బంజారాహిల్స్, మార్చి 11: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ ఆర్ఆర్) ఉత్తర భాగంలో 28 కిలోమీటర్ల పరిధి నుంచి 40 కిలోమీటర్ల పరిధికి మార్చాలని డిమాండ్ చేస్తూ పలు మండలాలకు చెందిన రైతులు మంగళవారం బంజారాహిల్స్‌లోని నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. ఆర్ ఆర్ఆర్ భూనిర్వాసిత ఐక్యవేదిక (ఉత్తర భాగం) ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలో వేదిక కన్వీనర్ చింతల దామోదర్ రెడ్డి మాట్లాడుతూ.. హైదరాబాద్ నగరం చుట్టూ ఇప్పటికే ఉన్న ఓఆర్ఆర్ మీద ఇంకా పూర్తిస్థాయిలో రద్దీ లేకున్నా రీజినల్ రింగ్ రోడ్డు పేరుతో కొత్త రోడ్డు కోసం ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. వేలాది మంది రైతుల పాలిట శాపంగా మారిన ఆర్ఆర్ఆర్ గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టినా రైతులకు అతి తక్కువ నష్టం ఉండేలా చూస్తామని చెప్పారన్నారు. అయితే కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర భాగంలోని ఆర్ఆర్ఆర్ పరిధిని 28 కిలోమీటర్లకు కుదించడంతో ఖరీదైన భూములు కోల్పోతున్నామన్నారు. ముఖ్యంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని భూములు, వలిగొండ, మండలంలోని భూములు రాయగిరి, గజ్వేల్, సంగారెడ్డి మునిసిపాలిటీ, రూరల్ ఏరియాలలో ఎకరానికి సుమారు రూ.2 నుంచి రూ.5కోట్లు మార్కెట్‌లో ధర ఉండగా తమకు కేవలం రూ.34 లక్షలు మాత్రమే నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పడం దారుణమన్నారు. ఎన్నికల సమయంలో ఆర్ఆర్ఆర్ బూచిని చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పెద్దలు ఇప్పుడు నోరు మెదపడం లేదని, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రాజగోపాల్‌రెడ్డి, కుంభం అనిల్‌కుమార్ రెడ్డి కనీసం రైతులతో మాట్లాడిన పాపాన పోలేదన్నారు. ఆర్ఆర్ఆర్ అలైన్మెంట్ డీపీఆర్లో తప్పులు ఉన్నాయని, రీ సర్వే చేయాలని కేంద్ర ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన నేపథ్యంలో ఓఆర్ఆర్ నుంచి 28 కిలోమీటర్లకు బదులుగా 40 కిలోమీటర్లకు మారుస్తూ కొత్త డీపీఆర్ ను తయారు చేయాలని డిమాండ్ చేశారు. చౌటుప్పల్, చిట్యాల, వలిగొండ, భువనగిరి, గజ్వేల్ నుండి సంగారెడ్డి వరకు ఇప్పటికే ఉన్న 100 ఫీట్ల రోడ్డు నిర్మాణం చేస్తున్నందున ఆర్ఆర్ఆర్ అసవరమే లేదన్నారు. 15 ఏండ్ల కిందట వేసిన ఔటర్ రింగ్ రోడ్డు ప్రస్తుతం 25% ఆక్యుపెన్సీ కూడా లేని పరిస్థితి ఉండగా.. 30 ఏళ్ల తర్వాత అవసరాల కోసం ఇప్పుడే రైతులను ఇబ్బంది పెట్టడం దారుణమన్నారు. దక్షిణ భాగంలో ఆర్ఆర్ ఆర్ అలైన్‌మెంట్‌ను రాజకీయ నాయకుల అవసరాల కోసం, కార్పొరేట్ కంపెనీల కోసం 28 కిలోమీటర్ల నుంచి 40-50 కిలోమీటర్లకు మార్చిన ప్రభుత్వం ఉత్తర ప్రాంతంలోని రోడ్డు గురించి ఏ మాత్రం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 113 గ్రామాల్లో 4705 ఎకరాల భూమి సేకరిస్తామని చెప్పిన అధికారులు డంబెల్ మోడల్ పేరుతో 6వేల ఎకరాలను సేకరించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. భూసేకరణ చట్టం 2013 ప్రకారం.. భూసేకరణలో కోల్పోతున్న భూనిర్వాసితులలో 80% రైతులు నుంచి అంగీకార పత్రం తీసుకోవాల్సి ఉందని, భూ నిర్వాసిత రైతులతో కలెక్టర్, ఆర్డీఓ, ఎమ్మార్వో తదితర అధికారులు మాట్లాడి వాళ్లకేం కావాలో అడిగి తెలుసుకుని 80 శాతం మంది రైతులను ఒప్పించి భూమి తీసుకోవాల్సి ఉంటున్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కనీసం 20% రైతుల అంగీకారంతో భూ సేకరణ చేయకుండానే టెండర్లకు నోటీసులు ఇచ్చి 2013 భూ సేకరణ చట్టాన్నికి తూట్లు పొడుస్తూ రైతుల నుంచి అన్యాయంగా భూములను గుంజుకోవాలని చూస్తున్నారన్నారు. చట్టం ప్రకారం బహిరంగ మార్కెట్ రేట్ కి రెండింతలు మున్సిపాలిటీలలో, గ్రామీణ ప్రాంతాల్లో నాలుగు రెట్ల పరిహారం ఇచ్చి తీసుకుపోవాలి. కానీ రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ వ్యాల్యూని మార్కెట్ వ్యాల్యూ అని చెప్పి భూ సేకరణ చట్టం 2013 కి తూట్లు పొడుస్తున్నదని ఆరోపించారు. తమ అంగీకారం లేకుండా టెండర్ ప్రక్రియను ప్రారంభించవద్దని, ఎట్టి పరిస్థితిలో ఆర్ఆర్ ఆర్ కోసం భూములు ఇచ్చే ప్రసక్తేలేదంటూ ఆర్ఆర్ఆర్ భూనిర్వాసిత ఐక్యవేదిక నేతలు నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారులకు వినతిపత్రం అందజేశారు. ప్రాజెక్టుకు సంబంధించిన భూసేకరణ, అలైన్‌మెంట్ రాష్ట్ర ప్రభుత్వం పరిధిలో ఉందని, తాము ఏమీ చేయలేమని అధికారులు తేల్చి చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

పచ్చని పొలాలు పోతుంటే తట్టుకోలేకపోతున్నాం..

మేం ముగ్గురం అన్నదమ్ముళ్లం. మా కుటుంబానికి ఆరున్నర ఎకరాల పొలం ఉన్నది. దీనిలో నాలున్నర ఎకరాల పొలం ఆర్ఆర్ఆర్ కోసం పోతుందని చెబుతున్నారు. మాకు ఏడుమంది వారసులు ఉన్నారు. వ్యవసాయం మీదనే ఆధారపడి బతుకుతున్నాం. భూమి పోతే రోడ్డున పడాల్సిందే. వరి పంట పండే పచ్చని భూములు మావి. మూసీ కింద నీళ్లతో ఏడాదికి రెండు పంటలు పండే భూములు రోడ్డు కోసం పోతే మాకు ఆత్మహత్యలే మార్గం. మా ఊర్లో నర్సిరెడ్డి అనే రైతు భూమి పోతుందన్న బెంగతో ఏడాది కిందట గుండెపగిలి చనిపోయాడు. - జనార్దన్‌రెడ్డి, ముందోళ్లగూడెం

మా ఇంట్లోనే ముగ్గురి ప్రాణాలు పోయాయి..

ఆర్ఆర్ఆర్ వస్తుందని చెప్పినప్పటి నుంచి మా ఊర్లో జనం గుండెలు పగులుతున్నాయి. మా ఇంట్లోనే ముగ్గురు చనిపోయారు. సర్వే నంబర్ 201, 202లో మా అన్నదమ్ములందరికీ కలిసి 28 ఎకరాల పొలం ఉంది. ఏడుగురం అన్నదమ్ముళ్లం. రోడ్డు కోసం పొలం పోతదనే ్ందంటూ తప్పించుకుని తిరుగుతున్నారు.

-బీసం కృష్ణయ్య, వర్కట్‌పల్లి (ఎస్సీ మాల)

గ్రూప్ -1 పరీక్షలో అన్నీ అవకతవకలే..

ఖైరతాబాద్, మార్చి 11: రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రూప్-1 పరీక్షల్లో అన్ని అవకతవకలే జరిగాయని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ అన్నారు. సోమాజిగూడ ప్రెస్ క్లబ్లో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. గ్రూప్-1 పోస్టులకు కోసం పరీక్ష రాసిన అభ్యర్థుల భవిష్యత్ నేడు ప్రశ్నార్థకం అయ్యిందన్నారు. ముఖ్యంగా తెలుగు మీడియం రాసిన అభ్యర్థులకు నిరాశే మిగిలిందని, ఫలితాలు చూసి తలలు పట్టుకొని ఏడుస్తున్నారన్నారు. తెలుగు మీడియం చదువుకోవడమే వారు చేసుకున్న పాపమన్నట్లుగా పరీక్ష పేపరును దిద్దారని, వారిపై గ్రూప్ -1 స్టడీ సెంటర్ల మాఫియా కుట్రజేసిందన్నారు. మొదటి వంద ర్యాంకులు వచ్చిన ప్రతి అభ్యర్థి వివరాలు పబ్లిక్ డొమైన్లో పెట్టాలన్నారు. వారు కోచింగ్ తీసుకున్న కోచింగ్ సెంటర్ల వివరాలు బహిర్గతపర్చాలన్నారు. రేవంత్ రెడ్డి కులానికి చెందిన వారికే వంద ర్యాంకులు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఒక్కో గ్రూప్ -1 పోస్టుకు రూ.10కోట్లు తీసుకున్నట్లు సోషల్ మీడియా ద్వారా తమకు సమాచారం అందిందన్నారు. సీఎం రేవంత్ రెడ్డి పేషీ నుంచే ఇదంతా జరిగిందని ఆరోపించారు. సమావేశంలో ఓయూ జేఏసీ చైర్మన్ పాలడుగు శ్రీనివాస్, ప్రవీణ్ కుమార్, శ్రీహరి గౌడ్, గిరగాని భిక్షపతి గౌడ్, దాసరి మూర్తి, రాజు గౌడ్ పాల్గొన్నారు.

ఎన్నికల బిల్లులు చెల్లించాలని కాంట్రాక్టర్ల నిరసన

సిటీబ్యూరో, మార్చి 11(నమస్తే తెలంగాణ): ఎన్నికల బిల్లులు చెల్లించాలంటూ కాంట్రాక్టర్లు ఆందోళనను ఉధృతం చేశారు. ఎమ్మెల్యే, ఎంపీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా పోలింగ్, డీఆర్సీ సెంటర్ల ఏర్పాటు, ఎన్నికల సిబ్బందికి మౌలిక సదుపాయాల కల్పన, ఇతర పనులు చేపట్టామని, ఆ బిల్లులు మంజూరు చేయాలని బ్యాక్‌వర్డ్ క్లాసెస్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ జీహెచ్ఎంసీ చుట్టూ తిరుగుతున్నది. హైదరాబాద్ జిల్లాలోని 15 అసెంబ్లీ నియోజకవర్గాలలో 270 మంది కాంట్రాక్టర్లు పనిచేశారని, రూ. 27.50 కోట్ల బిల్లులు రావాల్సి ఉందన్నారు. ఈ విషయం కేంద్ర, రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లామని అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సత్తయ్య, భాస్కర్ రావు మండిపడ్డారు. మంగళవారం సచివాలయంలోని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను కలిసేందుకు కాంట్రాక్టర్లు ప్రయత్నించారు. ఉప ముఖ్యమంత్రి లేకపోవడంతో తమ ఛాంబర్‌లోని అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు.అనంతరం సచివాలయం ముందు కాంట్రాక్టర్లు నిరసనను వ్యక్తం చేశారు. మలక్‌పేట అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి బిల్లులు మంజూరు చేసిన అధికారులు మిగిలిన 14 అసెంబ్లీల బిల్లులు ఎందుకు రిలీజ్ చేయడం లేదని, త్వరలో ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని ఈ సందర్భంగా అసోసియేషన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ సాయి కిరణ్ హెచ్చరించారు.

పిరం చెరువుపై ఆక్రమణదారుల కన్ను

రాత్రికి రాత్రే మట్టి కుప్పలు పోసి చదును చేస్తున్న వైనం

పట్టించుకోని హైడ్రా

పిరం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో మట్టి కుప్పలు పోసి చదును చేస్తున్న ఆక్రమణదారులు

బండ్లగూడ,మార్చి11:గండిపేట మండలం పరిధిలోని పిరం చెరువుపై ఆక్రమణదారుల కన్ను పడింది. ఆక్రమణదారులు రాత్రికి రాత్రి మట్టి కుప్పలు పోసి చదును చేస్తున్నారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెలుస్తున్న నిర్మాణాలను అడ్డుకోవాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తున్నది. మండల పరిధిలోని బండ్లగూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉండే పిరం చెరువు విస్తీర్ణం 34 ఎకరాల 29 గుంటలు ఉండేది. కాగా, చెరువుల పరిరక్షణ కోసం నాడు మిషన్ కాకతీయ పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం చెరువుల పూడికతీత పనులను చేపట్టారు. దీంతో పిరం చెరువులో నీరు వచ్చి చేరుతుండేది. చెరువు చుట్టూ పక్షుల కిలకిల రాగాలతో ఉదయం.. సాయంత్రం వేళలో సేద తీరేందుకు వచ్చే ప్రజలకు ఎంతో ఆహ్లాదాన్ని పంచేది. గత ఏడాది కాలంలో పిరంచెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇరిగేషన్, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇస్తూ ఎఫ్‌టీఎల్‌లో నిర్మాణాలకు వత్తాసు పలుకుతున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు చర్యలు తీసుకొని ఆక్రమణదారుల నుంచి కాపాడి భవన నిర్మాణాలు జరగకుండా చూడాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

అడ్డగోలుగా అనుమతులు..

పిరం చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో అనేక అక్రమ నిర్మాణాలకు అధికారులు అడ్డగోలుగా అనుమతులు ఇస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పత్తాలేని హైడ్రా అధికారులు

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూములు చెరువులు, కుంటలు, పార్కులు కాపాడుతామని హైడ్రాను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇటీవల కాలంలో పిరం చెరువు పరిసర ప్రాంతాల్లో అనేక ఆక్రమణలు, నిర్మాణాలు జరుగుతున్నా హైడ్రా తమకు ఏమీ పట్టనట్టుగా ఉంది. గతంలో ఒకసారి హైడ్రా కమిషనర్ రంగనాథ్ పిరం చెరువును పరిశీలించి వెళ్లారు. నాడు నిర్మాణాలు తక్కువగా ఉన్నప్పటికీ నేడు పదుల సంఖ్యలో నిర్మాణాలు వెలుస్తున్నాయి. ఇప్పటికైనా హైడ్రా లాంటి సంస్థలు పట్టించుకొని ఎఫ్‌టీఎల్ తో పాటు పిరం చెరువు పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పిరం చెరువును కాపాడాలి..

పిరం చెరువును అక్రమ నిర్మాణదారులతోపాటు ఆక్రమణదారులపై చర్యలు తీసుకొని కాపాడాలి. గతంలో చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోలేదు. ఒకవేళ ఫిర్యాదు చేసిన రెండు రోజులు పని ఆపి మూడో రోజు నుంచి పనులు యధావిధంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకొని పిరం చెరువులు కాపాడాలి.- బండా నరేశ్ యాదవ్, స్థానికుడు

వసతి గృహాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ప్రత్యేక వసతి గృహం ఏర్పాటుకు ప్రతిపాదనలు

జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

సిటీ బ్యూరో, మార్చి 11(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ జిల్లాలోని ప్రత్యేక అవసరాల పిల్లల కోసం వసతి గృహం ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కాచిగూడలోని ప్రభుత్వ బాలికల ప్రత్యేక గృహ, సదనంలో వసతి గృహం కోసం భవనాన్ని పరిశీలించారు. కిచెన్, డైనింగ్ రూమ్, కళావేదిక, న్యూట్రిషన్ గార్డెన్ లను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు మనోధైర్యంతో ఉండేలా కౌన్సెలింగ్ ఇస్తూ అండగా ఉండాలన్నారు. పిల్లల సంఖ్యను, ఆరోగ్య సంరక్షణకు చేపడుతున్న చర్యలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పాత భవనంతోపాటు పరిసర ప్రాంతాలను పరిశీలించి పరిసరాలు ఎప్పుడికప్పుడు శుభ్రంగా ఉంచాలని సూచించారు. ప్రత్యేక గృహం, సదనంలో పనిచేస్తున్న సిబ్బంది పనితీరును అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏడీ రాజేందర్, ఇంచార్జి ప్రిన్సిపాల్ అమూల్య, తహసీల్దార్ సంధ్యారాణి, కౌన్సెలింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

మాదిగలను మోసం చేసిన ద్రోహి రేవంత్ : ఎంఎస్ఎఫ్

ఓయూలో మాదిగ విద్యార్థుల నిరసన దీక్ష

దీక్షకు కూర్చున్న ఎంఎస్ఎఫ్ నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, మార్చి 11 : మాదిగ జాతిని మోసం చేసిన ద్రోహిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని ఎంఎస్ఎఫ్‌నాయకులు అన్నారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం అయ్యేంత వరకు ఉద్యోగ ఫలితాలను ప్రభుత్వం తక్షణమే వాయిదా వేయాలని డిమాండ్ చేశారు. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టం కాకముందే వివిధ పోటీ పరీక్షల ఫలితాలు ఇవ్వడాన్ని నిరసిస్తూ ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కళాశాల ఆవరణలో ఎంఎస్ఎఫ్ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎస్ఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ నాయకత్వంలో గత మూడు దశాబ్దాల పోరాటంతో సాధించిన ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణను, మాదిగ జాతి నోటికాడి ముద్దను రేవంత్ రెడ్డి ప్రభుత్వం దూరం చేస్తోందని మండిపడ్డారు. అందరి కంటే ముందే తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని నిండు అసెంబ్లీలో మాట ఇచ్చిన రేవంత్ రెడ్డి నేడు మాదిగ జాతికి ద్రోహం చేస్తూ మాలల కుట్రలు, ఒత్తిళ్లకు లొంగి వర్గీకరణ లేకుండా ఫలితాలను ప్రకటిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్, మిగతా అన్ని ఉద్యోగ ఫలితాలను తక్షణమే నిలుపుదల చేయాలని డిమాండ్ చేశారు. వర్గీకరణ చేయకుండా ఉద్యోగ భర్తీ చేయడం వలన మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందని వాపోయారు. శాంతియుతంగా చేపట్టిన దీక్షకు పోలీసులు టెంటు వేయనీయలేదని ఆరోపించారు. నిరసన దీక్షకు ప్రముఖ కవి వేముల ఎల్లయ్య హాజరై పూలమాలలువేసి దీక్షను ప్రారంభించారు. వివిధ విద్యార్థుల సంఘాల నాయకులు నాగేశ్వరరావు, జీడీ అనిల్, జంగిలి దర్శన్, కాసర్ల మధు, సుమంత్, వేదాంత మౌర్య, జార్జి తదితరులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ఎఫ్ నాయకులు చిప్పలపల్లి సోమశేఖర్, కొమ్ము శేఖర్, డాక్టర్ పల్లెర్ల సుధాకర్, రాజు, జనపాల మహేశ్, చెడిపల్లి రఘు, ఏడెళ్లి అజయ్, దావు ఆదిత్య, అనిల్, అజయ్ కుమార్, కంజర్ల ప్రేమ్ కుమార్, నిఖిల్, మహిపాల్, అరుణ్, చిన్న, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పాలసీలను సద్వినియోగం చేసుకోవాలి

పాలసీల గురించి వివరిస్తున్న ఐపీపీబీఎం మేనేజర్ సంతోష్‌కుమార్

భూదాన్ పోచంపల్లి, మార్చి 11 : తపాల శాఖ అందించే బీమా పాలసీలను ప్రజలు సద్వినియోగం తీసుకోవాలని ఇండియన్ పోస్ట్ పేమెంట్ బ్యాంక్ మేనేజర్ సంతోష్‌కుమార్ అన్నారు. పట్టణంలో తపాల శాఖ ఆధ్వర్యంలో హెల్త్ ఇన్సూరెన్స్, గ్రూప్ ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ పాలసీలపై మంగళవారం ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.749 చెల్లిస్తే రూ.15లక్షల ప్రమాద బీమా, రూ.549 చెల్లిస్తే 10 లక్షల రూపాయల ప్రమాద బీమా ఉందని, 18నుంచి 69 సంవత్సరాల వయస్సు వారికి ఈ బీమా వర్తిస్తుందని తెలిపారు. సమగ్ర రక్షణ ప్లాన్ వ్యక్తిగత ప్రమాదాల నుంచి రక్షిస్తుందన్నారు. పోచంపల్లి ఎస్‌పీఎం వెంకన్న, బ్రాంచ్ పోస్ట్ మాస్టర్లు కరగల కుమార్, కూచిపూడి కేజీయ, మిరియాల భానుకుమార్, లక్ష్మణ్, సీతారాములు, లక్ష్మయ్య, భాను పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం

భూదాన్ పోచంపల్లి, మార్చి 11 : పట్టణంలోని లక్ష్మీనారాయణస్వామి దేవాలయంలో ఈ నెల 10నుంచి 16వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలకు హాజరు కావాలని ఆలయ పాలకవర్గ ప్రతినిధులు మంగళవారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డికి ఆహ్వాన పత్రిక అందజేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంక వినోద్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు భారత లవకుమార్, ధర్మకర్తలు మోటె మహేశ్, చేరాల సుధీర్, వేషాల మురళి, కూరపాటి బాబు, పాపని ముత్యాలు, కుసుమ వెంకటేశం, చేరాల మహేందర్ పాల్గొన్నారు.

గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు

మోటకొండూర్, మార్చి 11 : మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 6, 7, 8, 9 తరగతుల్లో ఖాళీ సీట్ల భర్తీకి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ జ్యోతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు ఈ నెల 31లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారులు ఆధార్, ఫొటో, సంతకం, ఫోన్ నెంబర్, కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయం, బోనోఫైడ్ సర్టిఫికెట్లను ఆన్‌లైన్ ద్వారా ఎంటర్ చేయించాలని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'రైతుల సమస్యలు పరిష్కరించాలి'

భువనగిరి అర్బన్, మార్చి 11 : రైతుబజార్‌లో రైతుల సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తానని రైతుబజార్ అధ్యక్షుడు ముకుందారెడ్డి అన్నారు. పట్టణంలో మంగళవారం రైతులతో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన కూరగాయలకు సరైన గిట్టుబాటు ధర ఇవ్వడం లేదన్నారు. రైతుబజార్‌లో దళారుల పెత్తనం ఎక్కువైందని, ఇందుకు రైతుబజార్ సంబంధిత అధికారిని తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతులు శ్రీనివాస్‌రెడ్డి, జయందర్‌రెడ్డి, నాగరాజు, కొండల్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవం

తుర్కపల్లి, మార్చి 11 : మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల వార్షికోత్సవ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాలతి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో తమ నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి తల్లిదండ్రులు అండగా నిలువాలని కోరారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, అరుణ, సత్యం, స్వరూపారాణి పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి అద్దాలు అందజేత

రామన్నపేట, మార్చి 11 : అంధత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా గత నెలలో గురుకుల పాఠశాల విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించారు. అవసరమైన విద్యార్థులకు మంగళవారం ఆర్‌బీఎస్‌కే రామన్నపేట బీటీమ్ ఆధ్వర్యంలో ఎంపీడీఓ యాకూబ్‌నాయక్ చేతుల మీదుగా కంటి అద్దాలను అందజేశారు. కార్యక్రమంలో వైద్యులు అశ్వినికుమార్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జాతీయ నూనెగింజల సాగుపై 13న సదస్సు

వ్యవసాయ యూనివర్సిటీ, మార్చి 11: భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి-భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ(ఐఏసీఆర్- ఐఐఓఆర్)జాతీయ నూనెగింజల సంస్థ ఈనెల 13న సదస్సు, కిసాన్ మేళా నిర్వహించనున్నట్లు రాజేంద్రనగర్‌లోని భారతీయ నూనెగింజల పరిశోధనా సంస్థ (ఐకార్-ఐఐఓఆర్) నిర్దేశకులు డా. రవికుమార్ మాథూర్ తెలిపారు. హైదరాబాద్, నూనెగింజలలో పలు అధిక దిగుబడినిచ్చే వంగడాలను అభివృద్ధి చేయడంతో పాటు గత మూడు శతాబ్దాలుగా జీవ నియంత్రణ సాంకేతికత రంగంలో వివిధ ట్రైకోడెర్మా, బీటీ, సంబంధిత ఉత్పత్తులను అభివృద్ధి చేయడంలో దేశ వ్యాప్తంగా ఘనత సాధించిందన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలే కాకుండా కర్ణాటక, మహారాష్ట్ర, తమిళనాడు తదితర దేశంలోని పలు రాష్ట్రాల నుంచి పెద్దఎత్తున ఈ మేళాలో పాల్గొననున్నారన్నారు.

బిల్లులు చెల్లించకుండానే పాఠశాలల వార్షిక ప్రణాళికలు

బీఆర్ఎస్ హయాంలో 'మన ఊరు-మనబడి'లో మేడ్చల్ జిల్లాలో రూపురేఖలు మారిన బహుదూర్‌పల్లి ప్రభుత్వ పాఠశాల

మేడ్చల్, మార్చి11(నమస్తే తెలంగాణ): ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి 'అమ్మ ఆదర్శ కమిటీలు' 'మన ఊరు-మనబడి' కార్యక్రమంలో చేపట్టిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులు మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో రూ. 25కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా వ్యాప్తంగా 'మన ఊరు-మనబడి'లో 176 పాఠశాలలలో అభివృద్ధి పనులు చేపట్టగా.. అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా 286 పాఠశాలలో అభివృద్ధి చేపట్టారు. వీటిలో రూ.25 కోట్ల బిల్లులను ప్రభుత్వం చెల్లించాల్సి ఉంది. మన ఊరు-మనబడిలో 12 అంశాల అభివృద్ధి పనులు చేపట్టగా.. అమ్మ ఆదర్శకమిటీలు తాగునీటి సౌకర్యం, ప్రహరీ, విద్యుత్, బాత్‌రూమ్‌లు తదితర అభివృద్ధి పనులు చేశారు. బిల్లులు అందించాలని కలెక్టరేట్ ప్రజావాణిలో ఫిర్యాదులు చేసిన విషయం తెలిసిందే.

పాఠశాలల వార్షిక ప్రణాళిక ఖరారు

జిల్లాలో అమ్మ ఆదర్శకమిటీల, మనఊరు-మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు పూర్తికాకుండానే పాఠశాలల వార్షిక ప్రణాళికను ఖరారు చేశారు. వచ్చే విద్యా సంవత్సరంలో వసతుల కల్పన, నాణ్యమైన విద్యనందించేందుకు విద్యాశాఖ 2025-26 ఏడాదికి రూ.30 కోట్లు జిల్లాకు అవసరమని ప్రతిపాదనలు సమర్పించారు. ఉన్నతాధికారులు ఆమోదం తెలిపినా..పూర్తైన పనులకే బిల్లులు రాకపోగా నూతన నిధులు మంజూరైనట్లు చెబుతున్నప్పటికీ అభివృద్ధి పనులు చేపడితే బిల్లులు ఎప్పుడు మంజూరవుతాయో తెలియని పరిస్థితి. జిల్లా వ్యాప్తంగా 504 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా.. ఇందులో 1,07 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మనఊరు-మనబడి ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపుమార్చి విద్యావ్యవస్థలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దిన విషయం తెలిసిందే. దీంతో ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల సంఖ్య అత్యధిక సంఖ్యలో పెరిగారు. ప్రభుత్వ పాఠశాలలో నో అడ్మిషన్ అంటూ బోర్డులు పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడిదంటే గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఇదే నిదర్శనం.



పతకాలు సాధించిన బేకరి చెఫ్ దివ్య సారిక

అంతర్జాతీయ చెఫ్ పోటీల్లో నాలుగు బంగారు పతకాలు

మేడ్చల్, మార్చి 11: అంతర్జాతీయ చెఫ్ పోటీల్లో మేడ్చల్‌కు చెందిన మహిళ నాలుగు బంగారు పతకాలను సొంతం చేసుకున్నది. 17వ ఎడిషన్ ఇండియన్ క్యులినరీ ఆర్ట్ ఛాలెంజ్ పోటీ ఈనెల 4 నుంచి 8వ తేదీ వరకు ఢిల్లీలో జరిగాయి. 800 పై చిలుకు చెఫ్‌లు ఈ పోటీల్లో పాల్గొనగా.. లైవ్ డిస్‌ప్లే, లైవ్ ప్రెజెంటేషన్, లైవ్ కుకింగ్ తదితర 18 విభాగాల్లో పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న మేడ్చల్ మున్సిపాలిటీ గిర్మాపూర్‌కు చెందిన బేకరీ చెఫ్ ఎంఎస్ దివ్య సారిక నాలుగు బంగారు పతకాలతో పాటు రెండు కాంస్య పతకాలను సాధించారు.